# లవ్ మ్యారేజ్

నాగమణి ఈజీ ఛైర్లో పడుకుని నవల చదువుకుంటున్న తండ్రి దగ్గరికి పిల్లిలా అడుగులు వేసుకుంటూ వచ్చింది.

పరంధామయ్య సీరియస్‌గా నవల చదవడంలో మునిగి పోయాడు.

నాగమణి "మ్యావ్... " అంది.

పరంధామయ్య నవలలోంచి తలెత్తకుండానే ఈజీ ఛైర్ పక్కనే ఉన్న చెప్పొకటి నాగమణి మీదికి విసిరాడు. అది ఆమె మోకాలుకి తగిలింది.

నాగమణి "హయ్యో!...." అంది విస్మయంగా.

అంతలోనే లోపల్నుండి అప్పడాల కర్రొకటి రివ్వున వచ్చి నాగమణి పెంకిమీద తగిలింది.

"హబ్బా!...." అంటూ బాధగా అరిచింది నాగమణి.

ఆ అరుపుకి పరంధామయ్య కంగారుగా తలెత్తి చూశాడు. లోపలి నుండి నాగమణి తల్లి శాంతమ్మ కూడా పరుగెత్తుకు వచ్చింది.

"ఎందుకలా అరిచావ్?...." అంటూ ఆశ్చర్యంగా కూతుర్ని ప్రశ్నించారు ఇద్దరూ.

"అరవక?.... నాన్నేమో నా మీదికి చెప్పిసిరారు— నువ్వేమో అప్పడాల కర్రతో నా తల బొప్పి కట్టించావ్!!" ఉక్రోషంగా అంది నాగమణి.

"అర్రే.... మేము విసిరినవి నీకు తగిలాయా!.... మేము ఇంట్లోకి పిల్లి వస్తుందని వాటిని విసిరాము" అన్నారు ఇద్దరూ.


"పిల్లా.... పిల్లెక్కడిది?.... అంది నాగమణి బుర్రమీది బొడిపెని తడుముకుంటూ.

"పిల్లి రాలేదా?.... మరి మ్యావ్.... అని వినిపించిందే ఇప్పుడు?" ఆశ్చర్యంగా అడిగాడు పరంధామయ్య.

నాగమణి సిగ్గుపడింది.

"అదా?.... అదీ.... అలాగా మరేమో.... పిల్లిలాగా నేనే అరిచాను...."

"ఏం?.... మిమిక్రీ చెయ్యడం నేర్చుకుంటున్నావా? ఇహ ఈవాల్టి నుండి నీ కూతల్తో మేం చావాలన్నమాట!!...." మొహం చిట్లిస్తూ అన్నాడు పరంధామయ్య.




"నేనేం మిమిక్రీ చేయడం నేర్చుకోడం లేదుగా...." అంది నాగమణి మెలికలు తిరుగుతూ.

"మరెందుకలా అరిచావ్?...."

"మరి నేను మీ దగ్గరికి పిల్లిలా అడుగులు వేస్కుంటూ వచ్చాను కదా.... అందుకే అలా పిల్లిలా అరుస్తే బాగుంటుందని అరిచాను...."

"పిల్లిలా ఎందుకు అడుగులు వేస్కుంటూ వచ్చావ్?" మళ్ళీ ప్రశ్నించాడు పరంధామయ్య.

"హి...." అంది నాగమణి సిగ్గుపడుతూ.

"అది మిమ్మల్నేదో అడగాలని అనుకుంటుంది" అంది శాంతమ్మ.

"ఏంటో చెప్పు—" కళ్ళెగురవేశాడు పరంధామయ్య.

"మీ చేతిలోని నవల—" చెప్పబోయింది నాగమణి.

"హమ్మా— ఈ నవల నేన్నీకిస్తానేం?— నేను చదివిన తర్వాత ఇస్తాను— అయినా కాలేజీకి వెళ్ళేదానివి క్లాసు పుస్తకాలు చదవాలిగాని ..కు నవల్లెందుకూ?—" కోపంగా అడిగాడు.

"నేనేం నవల చదవడానికి అడగడంలేదు. దాన్ని పక్కన పెట్టేసి నేను చెప్పేది శ్రద్ధగా వినమంటున్నాను—" అంది నాగమణి చీరకొంగు ..ంపేస్తూ.

"హయ్యో— హయ్యో— బంగారంలాంటి చీరనెందుకలా చింపే ..ావ్?— నువ్విలా చీరలు చింపేస్తూ ఉంటే మేం కొత్తకొత్త చీరలు ..ొంటూ ఉండానా?" రుసరుసలాడింది శాంతమ్మ.

నాగమణి పకపక్కన నవ్వింది.

"అయ్యో— నువ్వెంత అమాయకురాలివే అమ్మా— నేనేం చీరని కావాలని చింపలేదు— చీరకొంగుని వేలికేసి చుడుతుంటే అలా ..రిగిపోయింది—" అంది నాగమణి సిగ్గుపడుతూ.

"భలేదానివే— ఏదైనా అడిగేటప్పుడు చీరకొంగుని వేలుకి మామూలుగా మెల్లగా చుట్టాలిగానీ మరీ అంతగట్టిగానా?— నాపిచ్చి తల్లి అడుగమ్మా అడుగు—" అంది ప్రేమగా కూతురు తల నిమురుతూ శాంతమ్మ.

నాగమణి హఠాత్తుగా దబ్బున కిందపడింది. శాంతమ్మ కంగారుగా కూతుర్ని లేవనెత్తింది.

"అదేంటే— ఎందుకలా కింద పడిపోయావ్? అడిగాడు పరంధామయ్య ఆందోళనతో.

నాగమణి ముసిముసిగా నవ్వింది.

"ఎందుకంటే— మరేమో నేను సిగ్గుతో మెలికలు తిరిగానుగా—అందుకే చీర కాళ్ళకి చుట్టుకుపోయి దబ్బున పడ్డానన్నమాట!!—హి!"

"సిగ్గు పడేప్పుడు మరీ అంతెక్కువగా మెలికలు తిరక్కూడదమ్మా—" కూతురు తలని ప్రేమగా నిమురుతూ అంది శాంతమ్మ.

"అంత సిగ్గుపడే పని యేం చేశావమ్మా?" పరంధామయ్య కుతూహలంగా అడిగాడు. తను ఊహించిన విషయం గానీ కాదు కదా? అనుకున్నాడు మనసులో.

"నేను రమేష్‌ని ప్రేమించాను నాన్నా—" దబ్బున నేలమీదికి పడిపోతూ అంది నాగమణి.

"వాహాట్?!—" కళ్ళింతింతచేసి చూస్తూ అన్నాడు పరంధామయ్య.

శాంతమ్మ కూతుర్ని లేపనెత్తింది.

"అవును నాన్నా— నేను రమేష్‌ని గాఢంగా ప్రేమించాను—అతనుకూడా నన్ను గాఢంగానే ప్రేమించాడు—" మళ్ళీ దబ్బున నేలమీద పడింది నాగమణి.

శాంతమ్మ నెత్తి బాదుకుంటూ కూతుర్ని లేవనెత్తింది. "మరోసారి గనుక నువ్విలా దబ్బున పడ్తే నేను లేవనెత్తను— కాస్త తక్కువగా మెలి తిరుగు — కోపంగా అంది ఆమె.

"రమేషంటే ఎవరూ?—" పరంధామయ్య కూతురు వంక కొరకొరా చూస్తూ ప్రశ్నించాడు.

"రమేషంటే మనింటికి వెనుకలైన్లో కుటుంబరావుగారు లేరూ—వాళ్ళబ్బాయి నాన్నా— ఆయన నన్ను పెళ్ళి చేసుకోవాలని అనుకుంటున్నాడు నాన్నా— ఆయన మా పెళ్ళి గురించి వాళ్ళ నాన్నకి చెప్తే ఆయన కూడా ఏమీ అభ్యంతరం పెట్టకుండా ఒప్పుకున్నాడు. వచ్చేవారం కుటుంబరావు పెళ్ళి సంబంధం మాట్లాడడానికి మనింటికి వస్తారట నాన్నా—నాగమణి నేలమీద దబ్బున పడి లేచి నిల్చుంది.

"వీల్లేదు— ఆయన మనింటికి రావడానికి వీల్లేదు— పెళ్ళిమాటలు మాట్లాడడానికి వీల్లేదు. మీ ప్రేమని నేనొప్పుకోను—పెళ్ళికి అంతకంటే ఒప్పుకోను—"

"నాహన్నా —" బాధగా మూలిగింది నాగమణి. రమేష్‌ని పెళ్ళి చేసుకోడానికి మీ కభ్యంతరం ఉండకూడదు నాన్నా—"

"ఎందుకుండకూడదు?"— ఆశ్చర్యంగా అడిగాడు పరంధామయ్య.

"వాళ్ళకులం మనకులం ఒకటే నాన్నా—"

"ఒకటే అయితే మాత్రం అడ్డమైన వాడ్నీ పెళ్ళి చేస్కోడానికి నేనొప్పుకుంటానా?"

"ఆయన అడ్డమైనవాడు కాడు నాన్నా— నిలువుగా సన్నగా ఉంటాడు — ఫారిన్ రిటర్న్డు డాక్టరు— అందంగా ఉంటాడు— ఆస్థికూడా ఉంది —"

"నువ్వేమైనా చెప్పు— ఈ పెళ్ళికి నేనొప్పుకోను" రంకేవేశాడు పరంధామయ్య.

"పోనీ ఒప్పుకోండీ— మంచి సంబంధమేగా" అంది శాంతమ్మ.

"నోర్ముయ్— నీకు తెలీదు— దాని పెళ్ళి నా యిష్ట ప్రకారం నేను చూసిన వాడితో జరగాలి—"

నాగమణి తండ్రిని కాళ్ళవేళ్ళ బ్రతిమలాడింది. ఆయన్లేకపోతే బ్రతకలేనంది— అయితే చావు అన్నాడు పరంధామయ్య. నాగమణి కన్నీరు మున్నీరుగా ఏడ్చింది.అయినా పరంధామయ్య కరగలేదు. ఆయన్ని కన్విన్స్ చేయడానికి రమేష్ వస్తే గెటవుట్ అన్నాడు పరంధామయ్య.

ఆరోజు— పార్కులో—

"మనం లేచిపోదాం రమేష్—" అంది నాగమణి.

"ఇంకా ఆరేగా అయ్యింది?— మనం ఏడుదాకా కూర్చోవచ్చు పార్కులో" అన్నాడు రమేష్ వాచ్ వంక చూస్తూ.

నవ్వితే నవ్ రత్నాలు–ప్రియవేళ పత్రిక 27.9.83 1

వేది

"నేనంటుంది ఇక్కడి నుండి లేచిపెళ్ళడం గురించి కాదు అంటుంది— ఎక్కడికైనా లేచెళ్ళిపోయి పెళ్ళి చేసుకుందామంటున్నా—

నాగమణి రమేష్ బుగ్గమీద పొడిచింది.

"పెళ్ళి కాకముందే నువ్విలా బుగ్గపోట్లు పొడిస్తే పెళ్ళయ్యాక నన్ను చావగొడ్తావేమో!— ఇలాగైతే నేను ఒప్పుకోనంతే—" అన్నాడు రమేష్ బుగ్గ తడుముకుంటూ.

"సర్లే— సర్లే— పెళ్ళయ్యాక చూద్దాం—" అంది నాగమణి.

నాగమణి తండ్రి ఎటూ వాళ్ళ పెళ్ళికి ఒప్పుకోడని వాళ్ళు రిజిస్టర్ మ్యారేజి గుట్టు చప్పుడు కాకుండా చేసుకున్నారు.

పెళ్ళయిన నెలరోజుల్లోనే పరంధామయ్య వాళ్ళని క్షమించేసి ఇంటికి ఆహ్వానించి చక్కగా మాట్లాడాడు. అంతేకాదు మొదటి పండక్కి అల్లుడిని పిల్చి ఖరీదైన బట్టలు పెట్టాడు.

"ఆరోజు అది రమేష్ని చేసుకుంటే దాన్ని గుమ్మం తొక్కనివ్వనని అన్నవాళ్ళు ఈరోజు ఇంత ఇదిగా ఎలా కల్సిపోయారండీ?— భర్తని అడిగింది శాంతమ్మ ఒకరోజు.

"ఓసి పిచ్చి మొహమా— అది రమేష్ని పెళ్ళి చేసుకోవడం నాకిష్టమేనే— బంగారం లాంటి సంబంధం అది. అది చెప్పినప్పుడు నేను వెంటనే ఒప్పుకుంటే రమేష్ వాళ్ళ నాన్న పెళ్ళి మాటలకి వచ్చి కట్నం ఇంత— లాంఛనాలు ఇంత అంటూ బేరాలు ఆడేవాడు. లక్షలు వదిలేవి. నేను ఒప్పుకోలేదు కాబట్టే వాళ్ళు లేచెళ్ళిపోయి కానీ ఖర్చు నాకు లేకుండా పెళ్ళి చేసుకున్నారు—"

చిరునవ్వుతో సమాధానం ఇచ్చాడు పరంధామయ్య.